క్లుప్తంగా

ఆదోని అభివృద్ధిపై దృష్టి సారించండి


పోలకల్ మునిస్వామి

ఆదోనిటౌన్‌: కూటమి నేతలు ఆదోని నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పోలకల్ మునిస్వామి అన్నారు. బసాపురం ఎస్‌ఎస్ ట్యాంకు మరమ్మతుల కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి, సెంట్రల్ ఫండ్స్‌తో అభివృద్ధి పనులు చేయించాలన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆదోనిలో 13 నెలలు కావొస్తున్నా ఒక్క అభివృద్ధి పని కూడా జరగలేదన్నారు. తాగు, సాగునీటి ప్రాజెక్టులపై దృష్టి సారించాలన్నారు.

మానవ అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ భార్గవి, విజయ మహిళా మండలి సంస్థ సభ్యులు

ఎమ్మిగనూరుటౌన్‌: మానవ అక్రమ రవాణాపై పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని డీఎస్పీ భార్గవి అన్నారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయ ఆవరణలో స్థానిక విజయ మహిళా మండలి ప్రాజెక్ట్ డైరెక్టర్ వేణుగోపాలాచారి, సంస్థ సభ్యులతో కలిసి మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు.

వరుణుడి కోసం ఏటియాత్రలు


తుంగభద్ర జలాలతో పాద యాత్రగా వెళ్తున్న చిలకలదోణ గ్రామస్తులు

మంత్రాలయం రూరల్ : ఈ ఏడాది ముందస్తుగా మురిపించిన వరుణుడు ఆ తరువాత ముఖం చాటేశాడు. ఊరించి ఉసూరుమనిపించాడు. అన్నదాతల మోముల్లో నైరాశ్యాన్ని నింపాడు. వాన దేవుడి కరుణ కోసం ఊరి దేవళ్లకు జలాభిషేకాలు గావిస్తున్నారు. కాలినడకన ఏటి యాత్రలు చేపట్టి పవిత్ర జలాలతో గ్రామ దేవతమూర్తులను అభిషేకించి దేవుడా వర్షించంటూ వేడుకుంటున్నారు. మండలంలోని చిలకలదోణ గ్రామ నుంచి దాదాపు 500 మంది గ్రామస్తులు, కల్లుదేవకుంట నుంచి 200 మంది గ్రామస్తులు మేళ తాళలతో పవిత్ర తుంగభద్ర నదిలో పుణ్యస్నానాలు ఆచరించి పూజలు గావించారు. అనంతరం నది జలాలతో గ్రామ దేవతమూర్తులకు జలాభిషేకాలు కానిచారు.

జిల్లాస్థాయి అథ్లెటిక్స్‌లో ప్రతిభ


విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

కౌతాళం: జిల్లా స్థాయి అథ్లెటిక్స్ మీట్‌లో ఉరుకుంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి పదవ తరగతి విద్యార్థి నాగరాజు ప్రతిభ చూపినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హరిప్రసాద్ తెలిపారు. శుక్రవారం కర్నూలు ఇండోర్ స్టేడియంలో జరిగిన పోటీల్లో 600 మీటర్ల పరుగు పందెంలో ద్వీతియస్థానం సాధించి మోడల్‌ను సాధించాడన్నారు. ఈ సందర్భంగా శనివారం విద్యార్థి నాగరాజును వ్యాయమ ఉపాధ్యాయుడు రమేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రశాంతంగా జీవించండి

ఆదోని అర్బన్‌: పవిత్ర రాఖీని ధరించి, ప్రేమ శాంతితో జీవించాలని బ్రహ్మకుమారి అమ్మతేశ్వరి అన్నారు. రాఖీ పండుగను పురస్కరించుకుని శనివారం ఆర్టీసీ డిపో మేనేజర్ మహమ్మద్‌రఫిక్‌కు, ఆర్టీసీ సిబ్బందికి డిపోలో పనిచేసే కార్మికులకు మిఠాయి తినిపించి రాఖీలను కట్టారు. కార్యక్రమంలో కిష్టన్న, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొలువులు సాధించిన విద్యార్థులకు సత్కారం


పోలీస్ ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను సత్కరించిన వార్డెన్లు

ఎమ్మిగనూరుటౌన్‌: పోస్ట్‌మెట్రిక్ సంక్షేమ హాస్టల్లో చదువుకుంటూ పోలీస్ ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను శనివారం స్థానిక బీసీ హాస్టల్ వార్డెన్లు అబ్దుల్ అజీమ్, విశ్వనాథ్‌రెడ్డి ఘనంగా సత్కరించారు. ఎమ్మిగనూరు హాస్టల్‌కు చెందిన మద్దిలేటి, ఎస్.రహంతుల్లా, కె.కుమార్, డి.మహేష్, ఆదోని హాస్టల్‌కు చెందిన కురువ వీరేష్, లక్ష్మన్న, మల్లికార్జున, రజనీకాంత్, రామకృష్ణ నాయక్, యూసస్, వీరన్నలతో పాటు మంత్రాలయానికి చెందిన తాయన్న, గురురాజు, హనుమంతులను శాలువాలతో సన్మానించి అభినందించారు. తమకు సహకరించిన వసతి గృహ సంక్షేమ అధికారులను కొలువులు సాధించిన విద్యార్థులు సత్కరించారు.

ఓట్ల కోసం ప్రజలను మోసం చేసిన బాబు

ఎమ్మిగనూరుటౌన్‌: ఓట్ల కోసం ప్రజలను సూపర్ సిక్స్ పేరిట మభ్యపెట్టి అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అయినా వాటిని అమలు చేయకుండా సీఎం చంద్రబాబు నాయుడు ప్రజలను మోసగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ సీనియయర్ నాయకుడు బుట్టా శివ నీలకంఠ, పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేషప్ప, వార్డు ఇన్‌చార్జులు బంగిశ్రీరాం, షబ్బీర్ అహమ్మద్, కౌన్సిలర్ ఖాశింబేగ్, మహబుబ్‌బేగ్, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహమ్మద్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, బీసీ విభాగ పట్టణాధ్యక్షుడు బజారి అన్నారు. శనివారం పట్టణంలోని 13, 14, 19, 20, వార్డుల్లో చంద్రబాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి సీఎం చంద్రబాబునాయుడు ఏడాది పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయక చేసిన మోసాలపై క్యూఆర్ కోడ్ ద్వారా వివరించారు.

హామీలను అమలు చేసిన జగనన్న

మాజీ సీఎం జగనన్న ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేశారని గుర్తు చేశారు. శనివారం రోజున అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పేరిట రైతులకు రూ.7వేలు రైతులకు జమ చేస్తామని సీఎం చంద్రబాబునాయుడు ప్రకటించారన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన పీఎం కిసాన్ డబ్బులు కేవలం రూ.2వేలు మాత్రమే రైతుల ఖాతాలో జమ చేసి మరోసారి మోసం చేశారని ఆరోపించారు. మిగిలిన రూ.5వేలు ఎప్పుడు జమ చేస్తారో అది


క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బుట్టా శివ నీలకంఠ, పార్టీ నేతలు

కూటమి ప్రభుత్వానికే తెలియాలని ఎద్దేవ చేశారు. కార్యక్రమంలో పార్టీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు ఎంకే శివప్రసాద్, అంగన్‌వాడీ, మహిళా విభాగం నాయకులు సావిత్రమ్మ, లతారెడ్డి, పార్టీ పార్టీ జిల్లా, పట్టణ పలు విభాగాల నాయకులు యూకే రాజశేఖర్, బజారిరెడ్డి, కోటకొండ నరసింహులు, శ్రీధర్‌రెడ్డి, యూయూ నాగేష్, రాజారత్నం, పాలశ్రీనివాసరెడ్డి, రుద్రాక్షాల బజారి, గురువయ్య మాబ్బాషా తదితరులు పాల్గొన్నారు.

బాబు ష్యూరిటీ అంతా బూటకమే

మంత్రాలయం : సూపర్ సిక్స్ హామీలతో సీఎం చంద్రబాబు ఇచ్చిన ష్యూరిటీ అంతా బూటకమని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భీమారెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి విశ్వనాథ్‌రెడ్డి అన్నారు. శనివారం


మంత్రాలయం మండలంలో బాబు మోసాలను గ్రామస్తులకు వివరిస్తున్న నాయకులు

మండలంలోని పరమాన్‌దొడ్డి, సింగరాజనహళ్లి గ్రామాల్లో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. పల్లెల్లో ఇంటింటికి వెళ్లి ప్రజలకు టీడీపీ ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. కార్యక్రమంలో సింగరాజనహళ్లి సర్పంచు మధుసూదన్‌రెడ్డి, మండల నాయకుడు రోగప్ప, గ్రామాల నాయకులు అనుమంతు నాయక్, వెంకటేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్‌కు ఎగనామం

కౌతాళం: సీఎం చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్‌కు ఎగనామం పెట్టారని, ప్రచార ఆర్భాటం చేస్తున్నారే తప్ప ప్రజలకు చేసిందేమి లేదని వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ప్రహ్లాదాచారి అన్నారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు శనివారం మేళిగనూరులో వెలిసిన రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామ నాయకులు రామన్నగౌడ్, ఎంపీటీసీ లింగన్నలగౌడ్‌ల ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి క్యూఆర్ కోడ్‌తో బాబు చేసిన మోసాలను ప్రజలకు వివరించారు. సూపర్ సిక్స్ అంటూ ఇప్పటి వరకు అమ్మఒడి పథకం తప్ప చేసిందేమిలేదన్నారు. అలాగే నదిచాగి, కుంబళనూరు, కుంబళనూరు క్యాంపు–1, క్యాంపు–2, మరళి గ్రామాలకు వెళ్లి సాయంత్రం వరకు పర్యటించి బాబు చేస్తున్న మోసాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించారు. కో ఆప్షన్ మెంబర్ మహబుబ్‌సాబ్, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, ఏకాంబర్‌రెడ్డి, హాల్వి బసవ్రపభు, వెంకటరామిరెడ్డి, కాత్రికి నాగభూషణ్‌గౌడ్, అబ్దుల్‌సమద్, అనిల్‌కుమార్, చెన్నప్పధని, సర్పంచ్‌లు మహేష్, సోమసుందరి, పాల్‌దినకర్, గోపాల్‌రెడ్డి, నర్సప్ప తదితరులు పాల్గొన్నారు.


క్యూఆర్ కోడ్‌ను ప్రజలకు అందజేస్తున్న మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి, నాయకులు

జిల్లా కలెక్టర్‌ను కలసిన డీఎస్పీ


జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఎస్పీ ఎం.ఎన్. భార్గవి

ఎమ్మిగనూరురూరల్‌: స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో శనివారం జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్‌లను డీఎస్పీ ఎం.ఎన్. భార్గవి మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. విధులను సమర్థవంతంగా నిర్వహించి ప్రజలకు న్యాయం అందచేలా చూడాలని కలెక్టర్ డీఎస్పీకి సూచించారు.

మెట్లు నిర్మించాలి


రాచోటి రామయ్య, మాజీ ఎమ్మెల్యే

ఆదోని అర్బన్‌: పట్టణంలోని వైఎంకే హైస్కూల్ సమీపంలో బ్రిడ్జిపై నుంచి కిందికి దిగేందుకు మెట్లు నిర్మించి పాదచారుల ఇబ్బందులు తొలగించాలని మాజీ ఎమ్మెల్యే రాచోటి రామయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైఎంకే పాఠశాల సమీపంలో ఉన్న రైల్వేగేటును మూసివేసి బ్రిడ్జి నిర్మించడం వల్ల కాలనీవాసులు, ఫ్యాక్టరీ కార్మికులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. మూసివేసిన గేటు పైన ప్రజలు దిగడానికి మెట్లు నిర్మించాలని కోరారు.

తొలి పింఛన్ టీడీపీ నేతల జేబుల్లోకి!

కౌతాళం: కూటమి ప్రభుత్వం స్పౌజ్ (పింఛన్ దారుడైన జీవిత భాగస్వామి చనిపోయిన వారికి)పింఛన్లను ఈ నెల మంజూరు చేసింది. అయితే నాయకులు మాత్రం పింఛన్‌దారులకు డబ్బులిచ్చినట్లు ఇచ్చి ఫొటోలు తీసుకుని ఆ డబ్బుల్ని తిరిగి తీసుకున్నారు. మీరు ఎవరికైనా చెబితే మీకు ఇక పింఛనే రాదు అని బెదిరించడంతో.. బాధితులు పోతేపోని ఒక నెల పింఛనే కదా అంటూ కొంత మంది తిరిగివెళ్లిపోగా.. కొందరు లబ్ధిదారులు మాలాంటి పేద వారి డబ్బులు తింటే మీకు ఏం సుఖం ఉంటుందని అని శాపనార్థాలు పెడుతున్నారు. నదిచాగి గ్రామంలో 10 మందికి వచ్చిన పింఛన్ డబ్బులు తిరిగి తీసుకోగా, మరళి గ్రామంలో నాయకులే తీసుకున్నారు. చాల గ్రామాల్లో శనివారం కొత్తగా వచ్చిన పింఛన్ల విషయంలో ఇదే జరిగింది. దీనిపై అధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరిపి పింఛన్ల డబ్బులు లబ్ధిదారులకు అందించాలని వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి లింగన్నగౌడ్ కోరారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ద్వారా ప్రభుత్వం పెద్దల దృష్టికి దృష్టికి తీసుకుని వెళ్తామని చెప్పారు.

నందవరం : ప్రభుత్వం జీవిత భాగస్వామి పద్ధతిన (స్పౌజ్) పింఛన్లు 117 మంజూరు చేసింది. ఆయా గ్రామాల్లో పింఛన్లు లబ్ధిదారులకు సచివాలయ సిబ్బంది అందజేశారు. అయితే తెలుగు తమ్ముళ్లు తొలి పింఛన్ డబ్బు తమ జేబులో వేసుకొని లబ్ధిదారులకు మొండి చేయి చూపారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై ఎంపీడీఓ పుల్లయ్య వివరణ కోరగా పింఛన్ల పంపిణీకి సచివాలయ సిబ్బంది ఏర్పాటు చేశామని, నూతన పింఛన్లు పంపిణీ కూడా సచివాలయ సిబ్బందే చేశారన్నారు. అయితే పంపిణీ అవకవతకలు జరిగానే విషయాలు తన దృష్టికి రాలేదని, తన దృష్టి వస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆలయాభివృద్ధికి విరాళం

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దేవాలయం వద్ద జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులకు శనివారం భక్తులు విరివిగా విరాళాలు అందజేసి తమ భక్తిని చాటుకున్నారు. అనంతపురం పట్టణ వాస్తవ్యులైన పి.రాజేష్‌కుమార్‌రెడ్డి రూ.59వేలను నగదు రూపంలో అందజేశారు. అలాగే దేవాలయం వద్ద నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి తుగ్గలి మండలం శభాష్‌పురం గ్రామ వాస్తవ్యులైన వి.రఘునాథ్‌రెడ్డి వారి కుటుంబ సభ్యులు రూ.50,000 నగదు రూపంలో అందజేశారు. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలను చేయించి స్వామి వారి తీర్థ


దాతకు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం


ప్రసాదాలను, పూలమాల, స్వామి వారి శేష వస్త్రాలు, లడ్డులను, బాండును, ఫొటోను అందజేశారు. ఆలయ అభివృద్ధికి భక్తులు విరివిగా విరాళాలు అందజేసి ఆలయ అభివృద్ధికి పాటుపడాలని ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు కోరారు. కార్యక్రమంలో ఆలయ ముఖ్య అర్చకుడు నాగరాజస్వామి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ నేతలంటే చిన్నచూపా?

ఆదోని రూరల్‌: బీజేపీ వారంటే టీడీపీ నాయకులకు అంత చిన్నచూపా అంటూ బీజేపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి నాగరాజుగౌడ్, జిల్లా నాయకులు విజయ్‌కృష్ణ తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని నాగనాథనహళ్లి గ్రామంలో శనివారం అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. స్టేజీపై టీడీపీ నాయకులు మాత్రమే ఆశీనులయ్యారు. బీజేపీ, జనసేన నాయకులకు కూర్చునేందుకు కుర్చీలు లేకపోవడంతో వారు మనోవేదనకు లోనయ్యారు. వారు స్టేజి కింద కూర్చొని టీడీపీ నాయకుల తీరు పట్ల నిరసన తెలిపారు. కూటమంటే టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలనే విషయాన్ని మరిచిపోవడం దారుణమన్నారు. అందరికీ సమానంగా కుర్చీలను వేయాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో సభలో కాసేపు గందరగోళం ఏర్పడింది. ఆ తర్వాత స్టేజీపై కుర్చీలను ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని మమ అనిపించారు.


నేలపై కూర్చొని నిరసన తెలియజేస్తున్న బీజేపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి నాగరాజుగౌడ్

డబుల్ ఇంజిన్ సర్కారు చేసిందేమిటో చెప్పండి ?


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కౌతాళం: డబుల్ ఇంజిన్ సర్కారు అన్నారు. రాష్ట్రంలో మేమే కేంద్రంలో మేమే అన్నారు. 14నెలలు కాలంలో ప్రజలకు చేసిందేమిటో చెప్పండంటూ వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రహల్లదచారి, ఏకాంబర్‌రెడ్డి, కో ఆప్షన్ మెంబర్ మహబుబ్‌సాబ్, ఎంపీటీసీ లింగన్నగౌడ్ ప్రశ్నించారు. శనివారం కుంబళనూరు క్యాంపులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పింఛన్లు తప్పా చేసింది ఏమి లేదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లలో చేసిన అప్పును చంద్రబాబు నాయకుడు ఒక్క ఏడాదిలోపే 75శాతం పూర్తి చేశారని, అయినా ప్రజలకు పథకాలు లేవు, సంక్షేమ అందలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం రూ.20వేలు అన్నదాత సుఖీభవ ఇస్తామని ఏడాది తరువాత కేంద్రం నుంచి వచ్చిన రూ.2వేలతో పాటు రూ.5వేలు కలిపి ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. గత ఏడాది భరోసా ఎక్కడికి వెళ్లిందని ప్రశ్నించారు. శుక్రవారం కౌతాళంకు చెందిన 40కుంటుంబాలు టీడీపీలో చేరినట్లు చెప్పడం అవాస్తవమన్నారు. వారిలోని ఒక వర్గం వారే మరో వర్గంలో వెళ్లారని చెప్పారు. తమ పార్టీ నుంచి కేవలం ఒక వ్యక్తి మాత్రమే తన స్వార్థం కోసం పోతే ఇలా చెప్పకోవడం భావ్యం కాదన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, రామన్నగౌడ్, చెన్నప్పధని, బసవప్రభు, వెంకటరామిరెడ్డి, అనిల్‌కుమార్ పలువురు పాల్గొన్నారు.

సమస్యలపై దృష్టి సారించండి

మంత్రాలయం రూరల్ : పంచాయతీ కార్యదర్శులు, మండల అధికారులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ వై.గిరిజమ్మ ఆదేశించారు. శనివారం మండల కేంద్రం మంత్రాలయం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ నూర్జహాన్ ఆధ్వర్యంలో మండల మీట్ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. వాతవరణ మార్పులతో నీరు కలుషితమైవుందని, గ్రామాలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గోవిందమ్మ, వైస్ ఎంపీపీ పుల్లికుక్క రాఘవేంద్ర, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి విశ్వనాథ్‌రెడ్డి, హౌసింగ్ డీఈ లాల్‌కృష్ణ, పీఆర్ ఏఈ మల్లయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు తాగునీరు అందించండి

మంత్రాలయం రూరల్ : సాంఘిక సంక్షేమ హాస్టల్‌లోని విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ గిరిజమ్మ మండల అధికారులకు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని సంక్షేమ హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ.. పిల్లల స్నానాలకు కాంక్రీట్ ఫ్లోరింగ్ ఏర్పాటు చేయాలని, తాగునీటి కోసం ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నూర్జహాన్, జెడ్పీటీసీ గోవిందమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి విశ్వనాథ్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య తదితరులు పాల్గొన్నారు.


మంత్రాలయంలో మాట్లాడుతున్న ఎంపీపీ వై. గిరిజమ్మ

రైతులు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలి

ఎమ్మిగనూరురూరల్‌: రైతులు వ్యవసాయంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా సూచించారు. శనివారం మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ రాఘవేంద్రచౌదరి, జిల్లా వ్యవసాయాధికారిణి వరలక్ష్మిల ఆధ్వర్యంలో అన్నదాత సుఖీభవ–పీఎం కిసాన్ 2025 మొదటి విడత నిధుల విడుదల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ కింద మొదటి విడతలో ప్రతి రైతు ఖాతాలో రూ. 7 వేలు జమ అవుతాయని తెలిపారు. జిల్లాలో 2.70 లక్షల ఎకరాల్లో పంటలు సాగుచేశారని చెప్పారు. జిల్లాలో యూరియా కొంత కొరత ఉందని, స్టాకు వచ్చిన వెంటనే అన్ని రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచుతామన్నారు. రైతులు పంటల సాగులో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులు, నానో యూరియాను ఉపయోగించుకోవాలని చెప్పారు. అనంతరం అన్నదాత సుఖీభవ–పీఎం కిసాన్ నిధుల చెక్కును విడుదల చేసి, రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్, ఆత్మ పీడీ రత్నప్రసాద్, తహసీల్దార్ శేషఫణి, ఏడీఏ మహమ్మద్‌ఖాద్రి, మార్కెట్ యార్డ్ చైర్మన్ కురవ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.


ఏపీ గురుకుల పాఠశాలలో లెక్కల్లో మెలకువలు నేర్పుతున్న జిల్లా కలెక్టర్

ఉపాధ్యాయుడిగా మారిన కలెక్టర్

మండల పరిధిలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయం, ఏపీ గురుకుల పాఠశాలలను శనివారం సాయంత్రం జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా సందర్శించారు. నవోదయ విద్యాలయం అవరణలో కొత్తగా వేస్తున్న రోడ్డు పనుల గూరించి ప్రిన్సిపాల్ ఇ.పద్మావతి, అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యాలయంలో విద్యార్థినీలతో మాట్లాడి ఎలా చదువుతున్నారు, ఏమైనా సమస్యలున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఏపీ గురుకుల పాఠశాలలో జిల్లా కలెక్టర్ ఉపాధ్యాయుడిగా మారి విద్యార్థినుల తరగతి గదిలో బోర్డుపై లెక్కలు వేసి, సులభతరమైన మెలుకవులు నేర్పించారు. మ్యాథ్స్ కన్నా సులభమైన సబ్జెక్ట్ మరేది లేదని, ఇష్టంతో చదవాలని సూచించారు. సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారం అందించండి

నందవరం : అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు పౌష్టికాహారంతో పాటు ఆట పాటలతో కూడిన విద్య బోధించాలని ఎంపీడీఓ పుల్లయ్య సూచించారు. శనివారం మండల పరిధిలోని పెద్దకొత్తిలి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని, ఎంపీపీ స్కూల్‌ను తనిఖీ చేసి, పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి పెద్దిరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

కోసిగి: పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు పట్టించాలని, ఆరునెలల వరకు తల్లిపాలు తాపడం శ్రేయస్కరమని సీడీపీఓ రాజేశ్వరి, డాక్టర్ రాజకిరిటీ అన్నారు. శనివారం మండలంలోని వందగల్లు గ్రామంలో, కోసిగిలోని 13వ, 18వ అంగన్‌వాడీ కేంద్రాలలో తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్స్ కాత్యాయిని, బాగ్యలక్ష్మీ బాయి తదితరులు పాల్గొన్నారు .

పెద్దకడబూరు : మండలంలోని కంబళదిన్నె గ్రామంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ విజయకుమారి, సీహెచ్‌ఓ రేవతి తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు.

ఎమ్మిగనూరుటౌన్‌: స్థానిక ఎస్‌ఎంటీ కాలనీ అంగన్ వాడీ కేంద్రం ఆవరణలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగలక్ష్మి, హష్మత్‌లు తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బాలింతలకు తల్లిపాల విశిష్టత గురించి వివరించారు.

రణమండల కొండపై భక్తజన సందడి


దర్శనం కోసం కొండ ఎక్కుతున్న భక్తులు




వేకువజామున స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

ఆదోని అర్బన్‌: పట్టణ శివారులోని రణమండల కొండలో వెలిసిన శ్రీ రణమండల ఆంజనేయస్వామికి శ్రావణమాసం రెండో శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు భారీగా తరలిరావడంతో కొండపై సందడి నెలకొంది. ఆలయ నిర్వాహకుడు టీజీ పాండయ్యశెట్టి ఆధ్వర్యంలో కార్తీకమాస నిత్య ప్రసాదసేవా సమితి సభ్యులు స్వామికి ఫల పంచామృతాభిషేకం, సింధూరసేవ, తులసీహారం, వివిధ రకాల పూల అలంకరణ, నైవేద్యం, మహా మంగళ హారతితో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకీసేవ, ఆలయ ప్రాంగణంలో రథోత్సవం జరిగింది.

సంక్షిప్తం

5న స్పాట్ అడ్మిషన్లు

ఆదోని సెంట్రల్‌: పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 5వ తేదీన స్పాట్ అడ్మిషన్లు జరుగుతాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. చిన్నపు రెడ్డి శనివారం విలేకరులకు తెలిపారు. వారు మాట్లాడుతూ పదవతరగతి ఉత్తీర్ణత సాధించి పాలిటెక్నిక్ కోర్సు చదవాలని ఆసక్తి ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాలిసెట్ ఎగ్జామ్స్ రాయకపోయినా పాలిటెక్నిక్ అడ్మిషన్‌కు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 4వ తేదీ తమ పేరు కళాశాలలో నమోదు చేసుకోవాలన్నారు. 5వ తేదీన రెండు సెట్లు జిరాక్స్ కాపీలు ఒరిజినల్ సర్టిఫికెట్స్ తీసుకొని రావాలన్నారు. కళాశాలలో ఈసీఈ బ్రాంచ్‌లో బీసీ అభ్యర్థులకు మూడు సీట్లు ఖాళీ ఉన్నాయన్నారు. ఈఈఈ బ్రాంచ్‌లో39 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఎవైనా సందేహాలు ఉంటే సెల్: 81215 55646, 99666 99093 నంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు.

4 నుంచి రాజకీయ శిక్షణ తరగతులు

ఆదోని సెంట్రల్‌: ఈ నెల 4, 5, 6వ తేదీలలో నంద్యాల పట్టణంలో జరిగే రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు ఆఖండ పిలుపునిచ్చారు. శనివారం ఆర్ట్స్ కళాశాలలోని అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ అవరణలో శిక్షణ తరగతులకు సంబంధించిన పోస్టర్లను పీడీఎస్‌యూ నాయకులు విడుదల చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు రసూల్, కిరణ్, వీరంజి, సోమేష్, శంశీ, కిరణ్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

ఆదోని రూరల్‌: ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు కర్నూలులో జరిగే సీపీఐ 24వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.అజయ్‌బాబు, సీపీఐ మండల కార్యదర్శి కల్లుబావిరాజు, ఏపీ కౌలు రైలు సంఘం జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం స్థానిక పార్టీ కార్యాలయ ఆవరణలో సీపీఐ 24వ జిల్లా మహాసభలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సహాయ కార్యదర్శి కామ్రేడ్ ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రామచంద్రయ్య పాల్గొన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

గోనెగండ్ల : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గణితం గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ పరమేశ్వర రెడ్డి తెలిపారు. కళాశాలలో గణితం బోధించుటకు ఎంఎస్సీ గణితం చదివి, 50 శాతం మార్కులు కలిగి ఉన్నావారు అర్హులన్నారు. ఆసక్తి గలవారు ఈనెల 4వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు తమ బయోడేటాను కళాశాలలో అందజేయాలని తెలిపారు. 5వ తేదీ ఉదయం 10 గంటలకు డెమోక్లాస్ ఉంటుందన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక ఆదాయం

నందవరం : ఆయిల్ పామ్ సాగుతో రైతులు అధిక ఆదాయం పొందవచ్చని జిల్లా ఉద్యాన శాఖ అధికారి రామాంజనేయులు తెలిపారు. శనివారం మండల పరిధిలోని పూలచింత గ్రామంలో ఉద్యాన శాఖ, లివింగ్ ఫుడ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల ఉద్యాన శాఖ అధికారి శ్రీవాణి, మంత్రాలయం ఉద్యాన శాఖ అధికారిణి అపర్ణ పాల్గొన్నారు.

స్మార్ట్‌మీటర్లపై ఉద్యమించక తప్పదు

ఎమ్మిగనూరుటౌన్‌: ప్రజలపై ఆర్థిక భారం మోపే స్మార్ట్‌మీటర్లను బిగించే యోచనను ప్రభుత్వం విరమించుకునేందుకు ఉద్యమించక తప్పదని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు దేవసహాయం, సీఐటీయూ మండల అధ్యక్ష,కార్యదర్శులు గోవిందు, రాముడు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని కేవీపీఎస్ కార్యాలయంలో స్మార్ట్‌మీటర్లను బిగిస్తే కలిగే నష్టాలపై రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు.

హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలి

ఎమ్మిగనూరురూరల్ : సాంఘిక సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని కోరుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ విద్యార్థి సమాఖ్య, యూఎస్‌ఎఫ్ఐ, పీడీఎస్‌యూ సంఘాల నాయకులు శేఖర్, ఉదయ్, మహేంద్రబాబులు బనవాసి కేవీకే వద్ద శనివారం జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషాకు వినతి పత్రం అందజేశారు.

ఎంఈఓలుగా ఉపాధ్యాయలను నియమించొద్దు

నందవరం : ఎంఈఓ–1లుగా ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులను నియమించడం తగదని ఆపస్ రాష్ట్ర కార్యదర్శి ఉశేని అన్నారు. శనివారం మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆపస్ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. మండల విద్యాశాఖ అధికారి పోస్టులను కేవలం ప్రభుత్వ మేనేజ్‌మెంట్ స్కూల్ అసిస్టెంట్లను నియమించడం జరిగిందన్నారు. ప్రభుత్వ, పంచాయతీరాజ్ టీచర్ల ఉమ్మడి సర్వీసు ఆధారంగా భర్తీ చేయాలన్నారు. నాయకులు రాజు, బసవరాజు, హనుమంతరావు, విరుపాక్షి తదితరులు పాల్గొన్నారు.